ఓడిన వారిని ఎలా పిలుస్తారు?

● మంత్రి పొన్నంపై కృష్ణారావు ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలకు గెలిచిన ఎమ్మెల్యేను కాకుండా ఓడిపోయిన వారిని పిలవాలంటూ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడాన్ని తాను ఖండిస్తున్నానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కాంగ్రెస్ పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆషాఢ మాసం బోనాల పండుగకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది కేసీఆరే అని ఆయన అన్నారు. అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడూ గ్రామ దేవతల ఉత్సవాలకు, బోనాల పండుగకు నిధులు మంజూరు చేయాలేదని ఆయన ఆరోపించారు. బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పలు ఆలయాలకు చెక్కులు అందించేందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించకుండా చెక్కులు పంపిణీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా కాంగ్రెస్ బుద్ధి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.


శ్మశానవాటికలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిరీష

శ్మశానవాటిక సుందరీకరణ పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ శ్మశానవాటికను మంగళవారం కార్పొరేటర్ శిరీష సందర్శించారు. కాలనీ అసోసియేషన్, స్థానికులతో కలిసి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి శ్మశానవాటికను అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కార్పొరేటర్ ఆదేశించారు. డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రథమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, అనిల్, శోభ, లలిత, భాస్కర్, అనిత పాల్గొన్నారు.


యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

యూజీడీ పనుల్లో నాణ్యత పాటించాలి

● అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగం

అల్లాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యూజీడీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహ బేగం కాంట్రాక్టర్‌కు సూచించారు. అల్లాపూర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీనగర్ ఏ బ్లాక్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో రాజీవ్‌గాంధీనగర్‌లో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని కార్పొరేటర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రియాజ్, కొండయ్య, మల్లేష్, కృష్ణ, నరసింహారెడ్డి, ముత్యాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్య

● మేడ్చల్ జిల్లా విద్యాశాఖ ఏడీ రవీందర్‌రాజు


తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రవీందర్

కూకట్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లో సాంకేతికతను జోడిస్తూ డిజిటల్ విద్యను అందించనున్నట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ ఏడీ రవీందర్‌రాజు తెలిపారు. కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రవీందర్‌రాజు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న అన్ని విద్యా సంస్థల్లో సాంకేతికతను జోడిస్తూ బోధన కొనసాగిస్తామన్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్ ప్రొజెక్టర్లతో కాకుండా ప్రైవేట్ సంస్థ అయిన ఫిజిక్స్ ఖానా అకాడమీలతో ఒప్పందాలు చేసుకున్నామని, వారి సహకారంతో డిజిటల్ విద్యను అందించనున్నామని తెలిపారు. పాఠశాలలో విద్యా బోధనలో మార్పులు చేస్తున్నందున్న తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ఎన్‌సీసీకి 50 మంది ఎంపిక..

రక్షణ రంగంలో సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ దిక్సూచి లాంటిదని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ ఏడీ రవీందర్‌రాజు అన్నారు. ఎన్‌సీసీకి చెందిన 4, 5 బెటాలియన్‌కు చెందిన పలువురు అధికారులు కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌సీసీ సెలక్షన్ ఎంపిక పరీక్షను మంగళవారం నిర్వహించారు. ఎంపిక పరీక్షలో 50 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికయ్యారు. ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులను ఏడీ రవీందర్‌రాజు అభినందించారు. ఎన్‌సీసీలో చేరిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ బెటాలియన్ అధికారి తుల్జారామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, వీఎస్ఎస్‌శర్మ, మాణిక్యం, భాగ్య, శాంతిస్వరూపిని, సక్కుబాయి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

● బీజేపీ సీనియర్ నాయకుడు రవికుమార్


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రవి

హైదర్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. హైదర్‌నగర్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గ సమావేశాన్ని ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు, డివిజన్‌లోని సీనియర్ నాయకులతో కలిసి పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించి రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, కో-కన్వీనర్ మణిభూషణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు సెక్రటరీలు, బూత్ స్థాయి నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

● ట్రాఫిక్ జామ్!



కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు నుంచి పోచమ్మ టెంపుల్‌కు వెళ్లే మీసేవా రోడ్డులో కొందరు హోటల్ నిర్వాహకులు ఫుట్‌పాత్‌లపై వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఆ హోటల్‌కు వెళ్లిన ప్రజలు రోడ్డుపై టిఫిన్స్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

- కేపీ హెచ్‌బీకాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి)

వైఎస్సార్ సేవలు మరువలేనివి


రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రానికి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ అన్నారు. వైఎస్ఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కృష్ణారావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ వేర్వేరుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, వైఎస్ఆర్ అభిమాన సంఘం సభ్యులు సతీష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, జీఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆల్విన్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకందించిన అందించిన సేవలను గుర్తు చేశారు. నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, వంశీగౌడ్, బషీర్, నాగరాజు, రాజుగౌడ్ పాల్గొన్నారు.


పీర్ల పండుగలో పాల్గొన్న మూసాపేట వాసులు

మూసాపేటలో కొనసాగుతున్న పీర్ల ఉత్సవాలు

కూకట్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలో పీరీల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆశిర్ఖానా (పీరీలు భద్రపరిచే గది)లో ప్రార్థనలు చేశారు. మాజీ కౌన్సిలర్ శ్రీరామరావు, శ్రీశైలం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట వాసులు తూము నర్సింగ్, ఉప్పు వేణు, విజయ్‌మార్, జగన్మోహన్, శ్రీనివాసరావు, గౌస్, ఇషాక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కరెంట్ షాక్‌తో ఆటో డ్రైవర్ మృతి

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కరెంట్‌షాక్‌తో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన భాగ్యనగర్‌కాలనీలో మంగళవారం జరిగింది. నారాయణఖేడ్ సత్యాంపల్లి గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (37) భాగ్యనగర్ కాలనీలో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సాయిబాబా ఆలయానికి ఫ్లెక్సీ కట్టేటప్పుడు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

గంజాయి తాగుతున్న ఇద్దరి యువకుల అరెస్ట్

హైదర్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ అంబేడ్కర్‌నగర్‌లోని రైల్వేట్రాక్ పక్కన సోమవారం రాత్రి కొందరు గంజాయి సేవిస్తున్నారని సమాచారం అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు యాల్లారం రాజు, పిట్ల శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు రెండేళ్లుగా గంజాయి తాగుతున్నారని, వారికి బాలానగర్‌లో ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్టు పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేయడంతో పాటు 35గ్రాముల గంజాయి, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

హైదర్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ ఫేజ్-7లో భార్య నాగమౌనికతో కలిసి చైతన్య(35) నివాసముంటున్నాడు. చైతన్యకు గతంలో వివాహం జరగగా విడాకులు తీసుకుని ఇటీవలే నాగమౌనికను రెండో వివాహం చేసుకున్నాడు. ఆషాఢ మాసం కావడంతో మౌనిక తన స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడు మెట్ట గ్రామానికి వెళ్లింది. అప్పటి నుంచి రోజూ మౌనిక చైతన్యతో ఫోన్‌లో మాట్లాడుతుంది. సోమవారం రాత్రి పది గంటలకు చైతన్యతో ఫోన్‌లో మాట్లాడిన మౌనిక అదే రోజు రాత్రి 11 గంటలకు ఫోన్ చేసింది. చైతన్య ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో విషయాన్ని అతని తల్లిదండ్రులకు చెప్పింది. వారు తలుపులు పగలగొట్టి చూడగా చైతన్య ఉరేసుకుని కనిపించాడు. తన భర్త ఆత్మహత్యపై ఎలాంటి అనుమానాలు లేవని, కేవలం మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నాడని చైతన్య భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

గచ్చిబౌలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బీఎల్‌ఓలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ ప్రశాంతి అన్నారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని బీఎల్ ఓలు, సూపర్‌వైజర్లకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ, ఓటరు లిస్టు తయారీలో కేంద్ర ఎన్నికల సంఘం మార్పులు తీసుకువచ్చిందని, ఫలితంగా సిబ్బందిపై పనిభారం పెరుగుతుందన్నారు. భారం పెరిగినా తమ విధులను విస్మరించకూడదని సూచించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు విధులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఒకే కుటుంబంలో 10 మంది ఓటర్లు ఉంటే గతంలో వివిధ బూతుల్లో పేర్లు ఉండేవని, ఇప్పటి నుంచి అలా ఉండవన్నారు. నియోజకవర్గంలో 7,68,418 మంది ఓటర్లు ఉండగా.. 69 పోలింగ్ బూత్‌లు మాత్రమే ఉన్నాయని, అయితే ఇప్పుడు వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. సిబ్బంది తాము చేసే పనుల వివరాలను అదే రోజు రిపోర్టు అందజేయాలని సూచించారు. చందానగర్, కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు ఆయా సర్కిళ్లలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



శిక్షణ అనంతరం సిబ్బందితో ఈఆర్‌ఓ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌యాదవ్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

హైదర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించి రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. డివిజన్‌లో ఉన్న ప్రతి సమస్యను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే వరకు ప్రజల పక్షాన పోరాటం చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, కో-కన్వీనర్ మణిభూషణ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు సెక్రటరీలు, బూత్ స్థాయి నాయకులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

వైఎస్‌ఆర్‌కు నివాళి

హైదర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తన కార్యాలయంలో నాయకులతో కలిసి వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీతో ఎందరికో ప్రాణాలు పోసి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన మహానేత వైఎస్‌ఆర్ అన్నారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్‌ఆర్‌దేనన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, వంశీగౌడ్, బషీర్, ఖలీమ్, నాగరాజు, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

హైదర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్య(35) కేపీహెచ్‌బీ ఫేజ్-7లో భార్య నాగమౌనికతో కలిసి నివాసం ఉంటున్నాడు. చైతన్యకు గతంలో వివాహం జరగగా విడాకులు తీసుకుని ఇటీవలే నాగమౌనికతో రెండో వివాహం జరిగింది. ఆషాఢ మాసం కావడంతో మౌనిక స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా తిరుగుడు మెట్ట గ్రామానికి వెళ్లింది. ఈ క్రమంలో ప్రతి రోజు మౌనిక ఫోన్‌లో చైతన్యతో మాట్లాడుతుంది. సోమవారం రాత్రి 10గంటల వరకు ఫోన్ మాట్లాడగా చైతన్య ఒత్తిడిలో ఉన్నట్లు గుర్తించి పెట్టేసింది. మళ్లీ 11గంటలకు ఫోన్ చేయగా చైతన్య ఫోన్ తీయలేదు. అతడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి చూడగా చైతన్య ఉరేసుకుని కనిపించాడు. ఊరి నుంచి వచ్చిన భార్య తన భర్త ఆత్మహత్యపై అనుమానాలు లేవని, కేవలం మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యు) నాయకులు

గచ్చిబౌలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయాలని ఎంసీపీఐ(యు) డిమాండ్ చేసింది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా హామీలను అమలు చేయక పోవడం సిగ్గుచేటన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ఎంసీపీఐ(యు) నాయకులు స్థానికులతో కలిసి ధర్నా చేశారు. అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మియాపూర్ ప్రాంతంలో బస్తీలో పేదల ఇళ్లను కూల్చి ఇందిరమ్మ ఇళ్లు కడతామని అధికారులు తిరుగుతున్నారని, ఇలా చేయడం హాస్యాస్పదమన్నారు. నియోజకవర్గంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ ఇళ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దశరథ్‌నాయక్, వనం సుధాకర్, సుకన్య, కళావతి, చైతన్య, ఈశ్వరమ్మ, శ్రీకాంత్, రాజేష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చాతుర్మాస్య దీక్షా మహోత్సవాలు

చందానగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): విశాఖ శారదాపీఠ పాలిత చందానగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో జూలై 10 నుంచి చాతుర్మాస్య దీక్షా మహోత్సవం ప్రారంభం కానుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి పలు అంశాలను వివరించారు. గురు శిష్య పరంపరలో చతుర్మాస్య దీక్ష అత్యంత పవిత్రమైన వ్రత సంప్రదాయమన్నారు. కార్యక్రమం సందర్భంగా స్వామివారు ప్రవచనాలు, ధార్మిక సభలు, సమూహిక విష్ణు, లలితా సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం వంటివి ఉంటాయన్నారు. దీక్ష కాలంలో ప్రతిరోజూ వెంకటేశ్వరస్వామి దర్శనంతో ప్రారంభించి సాయంత్రం అమ్మవారికి హారతి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు.



దాతలు అందజేసిన బల్లలపై కూర్చున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

రాయదుర్గం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కోమరగౌని శంకర్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటేష్‌గౌడ్, మనవడు అఖిల్‌గౌడ్ బల్లలు, ఆఫీస్ టేబుల్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా హాజరై వారి చేతుల మీదుగా ఫర్నిచర్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పాఠశాలకు బల్లలు, టేబుల్స్ ఇచ్చిన వెంకటేష్‌గౌడ్, అఖిల్‌గౌడ్‌ను వారు అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, సుధాకర్, అరుణ్, కిషోర్, నవీన్, ప్రభాకర్, సత్తయ్య, పవిత్రమ్మ, నిర్మలమ్మ, యాదయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర కీలకం

చందానగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చందానగర్ మున్సిపల్ కల్యాణమండపంలో మంగళవారం నేషనల్ ట్రైనింగ్ ఫర్ కెపాసిటీ బిల్డింగ్ అనే అంశంపై చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర కీలకమని, క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి కచ్చితమైన సమాచారం సేకరించి నమోదు చేస్తేనే వాస్తవ ఫలితం వస్తుందన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ అని, ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు దిశానిర్దేశం చేశారు.

ఇద్దరు గంజాయి వినియోగదారుల అరెస్ట్

హైదర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి వినియోగిస్తున్న ఇద్దరు యువకులను కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి కేపీహెచ్‌బీ కాలనీ అంబేడ్కర్‌నగర్ రైల్వే ట్రాక్ పక్కన గంజాయి తాగుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని యాల్లారం రాజు, పిట్ల శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు రెండేళ్లుగా గంజాయి తాగుతున్నారని, వీరు బాలానగర్‌లో ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి వద్ద ఉన్న 35గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'గేటెడ్ కమ్యూనిటీల ప్రజలకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలి'

గచ్చిబౌలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గేటెడ్ కమ్యూనిటీ ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారని, వారికి దగ్గరలో పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు దీనిపై లేఖలు రాసినట్లు తెలిపారు.



రామచందర్‌రావుతో వివేకానందనగర్ బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వివేకానందనగర్ డివిజన్ నాయకులు

హైదర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావును మంగళవారం వివేకానందనగర్ డివిజన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోపాలరావు, భాస్కర్‌రెడ్డి, కనకచంద్రం, శ్రీనివాస్, వేణు, రేణుక, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


వాణినగర్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంత

ఇలా తవ్వి వదిలేస్తే ఎలా?

● ప్రమాదకరంగా తాగునీటి వాల్వ్ గుంత

కుత్బుల్లాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటం కానుంది. తాగునీటి వాల్వ్‌కు మరమ్మతులు చేయించేందుకు రోడ్డు పక్కన గుంతను తవ్వించిన అధికారులు పని పూర్తయ్యాక దానిని పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు ప్రమాదాల బారినపడే పరిస్థితి నెలకొంది. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ నుంచి రేణుక ఎల్లమ్మ అలయం వైపు వాణినగర్‌లోని ప్రధాన రోడ్డు పక్కన తాగునీటి వాల్వ్‌కు అధికారులు మరమ్మతులు చేయించారు. వారం రోజులు కావస్తున్నా.. తవ్వించిన గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు అందులో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు, వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను మూయించాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కండేయ నగర్‌లో నాకాబందీ

జీడిమెట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో మంగళవారం రాత్రి పోలీసులు నాకా బందీ నిర్వహించారు. బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్‌ఐలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 40 బైక్‌లు, 3 ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఒక బెల్ట్‌షాప్‌ను సీజ్ చేశారు.

హోటళ్లపై కేసులు నమోదు

పేట్‌బషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు నడుపుతున్న హోటళ్లపై పేట్‌బషీరాబాద్ పోలీసు లు కేసులు నమోదు చేశారు. సోమవారం రాత్రి ఒంటి గంట తర్వాత కూడా తెరిచి ఉన్న బిర్యానీ హౌస్, రాజుగారి బిర్యానీ హోటల్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

హిజ్రాలపై న్యూసెన్స్ కేసు

పేట్‌బషీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులను డబ్బులు డిమాండ్ చేస్తున్న పలువురు ట్రాన్స్‌జెండర్లపై పేట్‌బషీరా బాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసల కథనం ప్రకారం.. సుచిత్రా చౌరస్తాలో మంగళవారం కొందరు ట్రాన్స్‌జెండర్లు వాహనదారులను డబ్బులు డిమాండ్ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన సీఐ.. వాహనదారులను డబ్బులు డిమాండ్ చేయడం నేరమని, చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై పబ్లిక్ న్యూసెన్స్ కింద కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడి అరెస్ట్

జీడిమెట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని బాలికకు మాయ మాటలు చెప్పి గర్భవతిని చేశాడో యువకుడు. నిందితుడిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఓ కుటుంబం జీవనోపాధి కోసం నగరానికి వచ్చి జగద్గిరిగుట్ట ప్రాంతంలో నివాసముంటోంది. వీరి కుమారుడు వినోద్(24) ఓ బాలికను ప్రేమపేరుతో నమ్మించి గర్భవతిని చేశాడు. బాధితురాలి తల్లిదండ్రులు జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. నగరంలో విషాద ఛాయలు

● రెండు కుటుంబాల్లో తీరని విషాదం
● జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న స్నేహితులు

పేట్‌బషీరాబాద్/సికింద్రాబాద్, మారేడుపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ తమ ఇద్దరు పిల్లలతో హాయిగా జీవితాన్ని గడుపుతున్నారు. అంతలోనే సంతోషాన్ని మృత్యువు కాటేసింది. భార్యా భర్తలతో పాటు వారిద్దరు పిల్లలు అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం నగర వాసులను తీవ్ర విషాదంలో నింపింది. రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రక్కు వారి కారును ఢీకొట్టడంతో మంటలు చెలరేగి పిల్లలతో సహా అగ్నికి ఆహుతైన సంఘటన విషయం తెలిసిందే. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లిలోని ఎన్‌సీఎల్ నార్త్ కాలనీకి చెందిన రవి, అనిత దంపతులకు కుమార్తె తేజశ్విని, కుమారుడు ఆకాశ్ ఉన్నారు. ఆకాశ్ అమెరికాకు వెళ్లి విద్యను పూర్తి చేసి అక్కడే సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్నాడు. అదేవిధంగా సికింద్రాబాద్ తిరుమలగిరిలోని జూపిటర్ కాలనీకి చెందిన పశుపతినాథ్, గిరిజల కుమారుడు శ్రీ వెంకట్, కూతురు దీపిక అమెరికాలోనే స్థిరపడ్డారు. ఇద్దరు పిల్లలు అమెరికాలోనే ఉండడంతోనే ఏడాది క్రితమే వారు వెళ్లి అక్కడే ఉంటున్నారు.

ఏడాది క్రితమే ఇల్లు కొనుగోలు

శ్రీవెంకట్, తేజస్వినిలకు 2012లో వివాహం జరగ్గా, వీరికి ఇద్దరు పిల్లలు. అమెరికాలోనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ డల్లాస్‌లో ఏడాది క్రితమే ఇంటిని కొనుగోలు చేసి అక్కడే నివాసముంటున్నారు. శ్రీవెంకట్ అక్క దీపిక అట్లాంటాలో ఉంటుంది. తేజశ్విని చిన్నాన్న నాగరాజు కూడా అట్లాంటాలోనే నివాసం ఉంటున్నాడు. దీంతో వీకెండ్ సెలవులు రావడంతో శ్రీవెంకట్ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి అట్లాంటాకు వెళ్లి ఆదివారం తమ కారులో తిరుగు ప్రయాణమయ్యారు.


శ్రీవెంకట్, తేజశ్విని, కుమార్తె మృద (ఫైల్)

పది నిమిషాల్లో హోటల్ గదికి చేరాల్సి ఉండగా

అక్క ఇంటి నుంచి బయలు దేరిన శ్రీవెంకట్, తేజస్విని దంపతులు తమ సొంత ఇంటికి చేరుకునేందుకు ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో మార్గమధ్యంలోనే ఒక హోటల్‌ను బుక్ చేసుకున్నారు. హోటల్ వద్దకు చేరుకునేందుకు మరో పది నిమిషాలు పట్టేది. అంతలోనే గ్రీన్ కౌంటీ సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ట్రక్కు ఢీకొట్టడంతో కారులో మంటలు చెలరేగి అందులో ఉన్న కుటుంబమంతా సజీవదహనమైంది.

అంచెలంచెలు ఎదిగి

2000-2002లో ఇంటర్‌ను రత్న జూనియర్ కాలేజీలో, బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూలో 2002-06లో పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సాధించారు. ఆ తర్వాత క్రమంగా పలు కంపెనీల్లో పని చేస్తూ అనుభవాన్ని తెచ్చుకున్న శ్రీవెంకట్ ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్నాడని స్నేహితులు తెలిపారు. అదేవిధంగా ప్రమాదంలో మృతి చెందిన తేజస్వినితో పాటు చదువుకున్న వారు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తమ్ముడు కూన శ్రీనివాస్ గౌడ్ తేజస్విని క్లాస్‌మేట్‌కు జరిగిన సంఘటనను గుర్తు చేసుకొని ఎంతో బాధను వ్యక్తం చేశారు. తనతో పాటే జీడిమెట్ల విలేజ్‌లోనే తేజస్విని హైస్కూల్ వరకు చదువుకుందని తెలిపారు.

జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న స్నేహితులు

సికింద్రాబాద్ వాసవినగర్‌కు చెందిన శ్రీవెంకట్ చిన్నప్పటి నుంచి స్నేహితులతో ఎంతో సరదాగా గడిపేవాడు. అమెరికాలో ట్రక్కు ఢీకొని శ్రీవెంకట్ కుటుంబం దుర్మరణం చెందినట్టు తెలియడంతో అతని స్నేహితులు దిగ్భ్రాంతి చెందారు.


షాపూర్‌నగర్ ఉషోదయ సర్కిల్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న శ్రీశైలంగౌడ్


నిజాంపేట రాజీవ్‌గృహకల్పలో నివాళులర్పిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జననేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి (వైఎస్ఆర్) జయంతి వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రారంభించి విజయవంతంగా అమలు చేసిన సంక్షేమ సారథి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వారు కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

డీజే నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

జీడిమెట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి డీజేలను పెట్టుకోవాలని బాలానగర్ ఏసీపీ పి.నరేష్‌రెడ్డి అన్నారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం ఆయన డీజే నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఏసీపీ మాట్లాడుతూ, కొంత కాలంగా బాలానగర్ డీసీపీ పరిధిలో డీజేలపై నిషేధం ఉందని, మై ఫ్రెండ్స్ సౌండ్ అండ్ లైటింగ్ అసోసియేషన్ సభ్యుల విన్నపం, డీసీపీ సురేష్‌కుమార్ ఆదేశాలతో డీజేలకు అనుమతి ఇస్తున్నామన్నారు. నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా వ్యవహరించే డీజే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, ఎస్‌ఐలు సత్యం, రాజేష్ పాల్గొన్నారు.


దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న కనకమల్లు

పేద దివ్యాంగులకు ప్రభుత్వం అండ

షాపూర్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్లను జీహెచ్ఎంసీ సీఈఓ కనకమల్లు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిరుపేద దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, నడవలేని వారికి ట్రైసైకిళ్లను అందజేస్తోందని తెలిపారు. పేద వికలాంగుల వివరాలు అందజేస్తే వారందరికీ ట్రైసైకిళ్లు అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు మహేష్‌గౌడ్, రాజీవ్‌గాంధీనగర్ అధ్యక్షుడు దొడ్ల శ్రీనివాస్, స్థానిక మహిళలు విజయలక్ష్మి, డ్వాక్రా మహిళలు హేమలత, దుర్గలు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలోని 1వ డివిజన్ పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారు లు, పాలకులు ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తున్నామన్నారు. బాచుపల్లి డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి, జీవీ రెడ్డి, జీవన్‌రెడ్డి, రాజసుధ, నవీన్, ప్రభాకర్, దుర్గారెడ్డి, శ్రీధర్, సురేష్, నర్సింహ ఉన్నారు.


రోడ్డు పనులను ప్రారంభించిన కొలన్ హన్మంత్‌రెడ్డి తదితరులు